# సత్యవాక్కు

# THE WORD OF TRUTH



## క్రైస్తవ మాసపత్రిక

JANUARY-2014

సంవత్సర చందా రూ.50/-

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న

సత్యవాణి టి.వి. కార్యక్రమములను దిగువ

సమయాల్లో వీక్షించండి

**ప్రతి ఆదివారము సాయంత్రం 6.00 గం॥లకు శుభవార్త**

**ప్రతి బుధవారం సాయంత్రం 6.30 ని॥లకు రక్షణ**

**ప్రతి గురువారం మధ్యాహ్నం 2.30 ని॥లకు రక్షణ**

**ప్రతి శనివారం ఉదయం 8.00 గం॥లకు ఆరాధన**

**ఛానల్‌లలో వీక్షించండి**

ఉచిత బైబిల్ కరస్పాండెన్సు కోర్సులో చేరండి. ఆకోర్సు పూర్తిచేసి ఒక బైబిలును ఉచితముగా బహుమతి పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి. మీ ఇరుగుపొరుగు వారు కూడా ఈ కోర్సు చేయవచ్చును


మా అడ్రస్

**సత్యవాణి**

**పో.బాక్స్ నెం.80,**

**కాకినాడ.ఏ.పి, 533 001**

**ఫోన్: 0884 - 2363722**

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 33 | జనవరి - 2014 | సంచిక - 6

## సత్యమును గ్రహించుకొనుట -3
## (Understanding the Truth)

మన ఆత్మ రక్షణ నిమిత్తము సత్యమును గ్రహించుకొనుట అతి ప్రాముఖ్యమని మనము గత రెండు సంచికలలోను తెలిసికొని యుంటిమి. అయితే కొందరు అజ్ఞానము వలనను, ముందుగా ఏర్పరుచుకొనిన అభిప్రాయముల వలనను, దురభిమాన ద్వేషము వలనను, లేఖనముల ద్వారా తమ అబద్ధ సిద్ధాంతములను నిరూపించ ప్రయత్నించు చుండుట వలనను దేవుని వాక్యమైన సత్యమును అపార్థము చేసికొనుచున్నారని కూడ గమనించి యుంటిమి. లేఖనముల విషయమై మనము పొరబడకుండు నిమిత్తము, లేఖనములలోని సత్యమును గ్రహించు కొను నిమిత్తము మనము కొన్ని సంగతులను చేయవలెను.

మొదటిగా, సత్యమును గ్రహించు కొనవలెనంటే మనము విశ్వాసము కలిగి యుండుట అవసరము. నీవు బైబిలును చదువునప్పుడు ప్రార్థన పూర్వకముగాను, విశ్వాసముతోను చదువుము. బైబిలులోని సంగతులను శంకించుచు నీవు చదివిన యెడల అందున్న సత్యమును గ్రహించు

కొనలేవు. కొందరు కేవలము ఈలోక జ్ఞానముపై ఆధారపడి దానిలో తప్పుల కొరకు వెదుకుచుందురు. అయితే అది పరిపూర్ణ దేవుడు లిఖించి యిచ్చిన గ్రంథము. అమితజ్ఞానియైన దేవుడు సంకుచిత జ్ఞానము గల మనకు తన చిత్తమును అందు బయలుపరచెను. ఆయన చిత్తమును మనము గ్రహించుకొన వలెనంటే విశ్వాసము అవసరము. "ఒకని యెదుట సరియైనదిగా కనబడు మార్గము కలదు. అయితే తుదకు అది మరణము నకు త్రోవతీయును" అని సామెతలు 14:12 లో వ్రాయబడి యున్నది. అయితే దేవుని మార్గములన్నియు పరిపూర్ణములు. అందుకే మనము వెలిచూపు వలన కాక విశ్వాసము వలన నడుచుకొనవలెనని అపొ. పౌలు 2 కొరింథి 5:7 లో హెచ్చరించుచున్నాడు.

నీవు సత్యమును గ్రహించుకొనుటకు ఆసక్తితో బైబిలును చదువుము. నీస్వంత అభిప్రాయములను బైబిలులో కనుగొనుటకు ప్రయత్నించుటకంటె దేవుని చిత్తమును తెలిసికొనుటకు, ఆయన యెదుట యోగ్యునిగా కనబడుటకు చదువుము. "దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కర లేని పనివానిగాను నిన్ను నీవే దేవునికి కనుపరచు కొనుటకు జాగ్రత్త పడుము" (2 తిమోతి 2:15). నిన్ను నీవే నీతిమంతునిగా కనుపరచుకొనుటకు గాక, మనుష్యులను సంతోషపెట్టుటకుగాక, సత్యమును గ్రహించి దానిని దాచి యుంచుకొను నిమిత్తము దేవుని గ్రంథమును చదువుము. దివారాత్రము దానిని ధ్యానించువాడు ఆకు వాడక తన కాలమందు ఫలమిచ్చు చెట్టు వలె యుండును. అతడు చేయునదంతయు సఫలమగునని దావీదు మహారాజు పలికెను.

బైబిలును చదువునప్పుడు కొన్ని సంగతులను మనము అర్థము చేసికొనుట కష్టము. అమితజ్ఞానియైన దేవుని మనస్సు అందు కొంచెము మాత్రమే బయలు పరచబడి యున్నది. మితజ్ఞానులమైన మనము ఆయమితజ్ఞానిని అర్థము చేసికొనుట కష్టము. అయితే మనము రక్షింపబడుట కేమి చేయవలెనో ఆ విషయములలో మాత్రము మనకు దేవుని గ్రంథమందు ఏమియు మరుగు చేయబడ లేదు. అందుకే "రహస్యములు మన దేవుడైన యెహోవాకు చెందును. అయితే మనము ఈ ధర్మశాస్త్ర వాక్యములన్నిటి ననుసరించి నడుచుకొనునట్లు బయలు పరచబడినవి యెల్లప్పుడు మనవియు, మనసంతతి వారివియు నగునని" ద్వితీ 29:29 చెప్పుచున్నది.

బైబిలును చదువునప్పుడు కనీసము మూడు సామాన్య సూత్రములను

పాటింపుము. అవేమంటే ఎవరు మాట్లాడుచున్నారు ? ఎవరితో మాట్లాడుచున్నారు? ఏకాలమందు మాట్లాడుచున్నారు ? అను ప్రశ్నలను వేసికొని బైబిలులోని సంఘటనలను మనము చదువవలెను. ఉదాహరణకు: "చితిసారకపు మ్రానుతో నీకొరకు ఓడను చేసికొనుము. అరలు పెట్టి ఆ ఓడను చేసి లోపటను వెలుపటను దానికి కీలు పూయవలెను" అని ఆదికాండము 6:14లో వ్రాయబడి యున్నది. ఈమాటలను చదువునప్పుడు మనము అవే మనకువర్తించుననుకొని వాటికి లోబడుటకంటె ఆ మాటలను ఎవరెవరితో పలికిరో తెలిసికొని చదువుట మంచిది. వాటిని దేవుడు నోవహుతో పితరుల యుగమందు పలికెను. గనుక మనలో ఎవడును రక్షింపబడుటకు చితిసారకపు మ్రానుతో ఓడను చేసి కొననవుసరము లేదు.

బైబిలునందలి సంగతులన్నియు మూడు యుగములుగ విభజింపబడి యున్నవని గమనించుము. అవి పితరులు యుగము, మోషే యుగము, క్రైస్తవయుగము. ఆయా యుగములలో నున్న ప్రజలకు దేవుడు తన చిత్తమును వివిధ రకములుగా తెలియపరచెనని గ్రహించుము. పితరుల యుగములో దేవుడు అజ్ఞాపించిన విధులను మోషే యుగములో అజ్ఞాపించలేదు. మోషే యుగములో అజ్ఞాపించిన వాటిని ఆయన క్రైస్తవ యుగములో అజ్ఞాపించలేదు. అందువలన దేవుడు ఒక యుగములో అజ్ఞాపించిన విధులను వేరొక యుగములో మనము ఆచరింప బూనుకొనుట మంచిది కాదు.

అట్లే బైబిలునందలి రెండు నిబంధనల సంబంధమును మనము తెలిసికొనవలెను. క్రైస్తవులు పాత నిబంధనను బట్టి గాక క్రొత్తనిబంధనను బట్టి నడుచుకొనవలెనని గ్రహింపుము. పాతనిబంధనను మనము సామాన్యముగా మోషే ధర్మశాస్త్రము అని పిలుచు చుందుము. అయితే మోషే ధర్మశాస్త్రము యూదులకు మాత్రమే ఈయబడెనని, అందువలన దానిలోని విధులను మనము నిర్వర్తించనక్కరలేదని గ్రహించుము. పాతనిబంధనను గూర్చి "మోషే ఇశ్రాయేలీయుల నందరిని పిలిపించి యిట్లనెను–ఇశ్రాయేలీయులారా, నేను మీ వినికిడిలో నేడు చెప్పుచున్న కట్టడలను, విధులను విని వాటిని నేర్చుకొని వాటి ననుసరించి నడువుడి. మన దేవుడైన యెహోవా హోరేబులో మనతో నిబంధన చేసెను. యెహోవా మన పితరులతోకాదు, నేడు ఇక్కడ సజీవులమై యున్న మనతోనే ఈనిబంధన చేసెను". గనుక ఇశ్రాయేలీయులు కానివారెవరికిని మోషే

ధర్మశాస్త్రము ఈయబడలేదని గమనించుము.

అంతేకాదు ఆ మోషే ధర్మశాస్త్రమును యేసుక్రీస్తు పూర్తిగ నెరవేర్చి సిలువకు మేకులతో దానిని కొట్టివేసి దాని స్థానమున క్రొత్త నిబంధన నిచ్చెనని గమనించుము. "దేవుడు వ్రాతరూపకమైన ఆజ్ఞలవలన మనమీద ఋణముగాను మనకు విరోధముగాను ఉండినపత్రమును మేకులతో సిలువకు కొట్టి దానిమీద చేవ్రాతను తుడిచివేసి మనకు అడ్డము లేకుండ దానిని ఎత్తి వేసెను" అని కొలస్స 2:14లో వ్రాయబడి యున్నది. "ఆధర్మశాస్త్రము దేనికిని సంపూర్ణసిద్ధి కలుగ జేయలేదు గనుక ముందియ్యబడిన ఆజ్ఞ బలహీనమైనందునను, నిష్ప్రయోజనమైనందునను అది నివారణ చేయబడి యున్నది; అంతకంటే శ్రేష్టమైన నిరీక్షణ దానివెంట ప్రవేశపెట్టబడెను. దీనిద్వారా దేవునియొద్దకు మనము చేరుచున్నాము" (హెబ్రీ 7:19).

మనము పాతనిబంధనను బట్టి గాక క్రొత్తనిబంధననుబట్టి నడుచుకొనవలెనని గ్రహించునప్పుడు సబ్బాతును గూర్చియు, ఆరాధనలో వాయిద్యములను గూర్చియు ప్రశ్నలు ఉద్భవింపనే ఉద్భవింపవు. అవి పాతనిబంధన కాలమునకు చెందినవి. దేవుని మనము శనివారమునగాక ఆదివారమున ఆరాధించవలెనని, ఆరాధనలో వాయిద్యములను గాక కీర్తనలతోను ఆత్మసంబంధమైన పాటలతోను దేవుని మహిమపరచవలెనని క్రొత్త నిబంధన బోధించుచున్నది.

బైబిలును చదువునప్పుడు లేఖనముల మౌనమును మనము గౌరవించవలెను. ప్రభురాత్రి భోజనము నందు మనము రొట్టెను, ద్రాక్షరసమును వినియోగించవలెనని లేఖనములు చెప్పుచున్నవి. అవి కేక్‌నుగాని నారింజ రసమునుగాని వినియోగించ రాదని చెప్పుటలో మౌనియై యున్నవి. అట్టి సమయములో లేఖనములు ఏమి చెప్పుచున్నవో వాటినే అనుసరించవలెను. అట్లే క్రొత్తనిబంధన ఆరాధనలో వాయిద్యములనుగూర్చి లేఖనములు మౌనియై యున్నవి. సరిగదా దేవుడు కోరునట్టిది స్వరగానము అని అవి బోధించుచున్నప్పుడు లేఖనములనే మనము గౌరవించవలెను. అందుకే లోకమందంతటా క్రీస్తుసంఘములు "బైబిలు ఎక్కడ మాట్లాడునో అక్కడ మాట్లాడుదుము. బైబిలు ఎక్కడ మౌనియగునో అక్కడ మౌనులమగుదము" అని చెప్పుచు ప్రజలు బైబిలును మాత్రమే యనుసరించవలెనని ప్రోత్సహించుచున్నవి.

ఏఅంశమును గూర్చియైనను ధ్యానించుచున్నప్పుడు ఆయంశము

అంతటిపై బైబిలు ఏమి బోధించుచున్నదో తెలిసి కొనవలెను. ఉదాహరణకు: రక్షింపబడుటకు నేనేమి చేయవలెను? అను ప్రశ్నకు జవాబును వెదుకునప్పుడు ఒకడు క్రీస్తును గూర్చిన సువార్తను వినవలెను (రోమా 10:17). క్రీస్తునందు విశ్వాసముంచవలెను (యోహాను 8:24). తన పాపముల విషయమై మారుమనస్సు పొందవలెను (లూకా 13:5). క్రీస్తు నందలి విశ్వాసమును మనుష్యుల యెదుట ఒప్పుకొనవలెను (మత్తయి 10:32,33). పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెను (అపో.కా. 2:38) అని లేఖనములు బోధించు చున్నవని గమనించుము. ఒకడు రక్షణ పొందవలెనంటే ఇవన్నియు అవుసరము. వాటిలో ఏ ఒక్క దానిని నిర్లక్ష్యము చేసిన యెడల అతడెట్లు రక్షింపబడగలడు?

మనము బైబిలును ఒకేరీతిగ అర్ధము చేసికొనగలము. దానిని గ్రహించుకొని దానికి లోబడి మోక్షము చేరునిమిత్తమే దేవుడు దానిని మన కిచ్చెను. నీవు సత్యమును గ్రహించి నేడే దానికి లోబడుము. లేనియెడల సత్యము నకు విధేయులు కానివారికి ఆయన ప్రతిదండన చేయునుసుమా !

## దుర్మార్గులైన తోట కాపులు
## (The Wicked Husbandmen)

మత్తయి 21:33-46; మార్కు 12:1-12 లూకా 20:9-19

**పరిచయము:**

యేసు విజయోత్సహముతో యెరూషలేములో ప్రవేశించిన తరువాత దేవాలయములో దుర్మార్గులైన తోట కాపులను గూర్చిన ఉపమానము చెప్పెను (మత్తయి 21:1-18). అక్కడ యేసు ప్రజలకు బోధించుచుండగా యాజకులు, శాస్త్రులు, యూదుల పెద్దలు ఆయనను ఆటంకపరచిరి (మత్తయి 21:23;మార్కు 11:27-28; లూకా 20:1). ఆయన ఏ అధికారము చొప్పున బోధించుచున్నాడో వారు తెలిసికొనగోరిరి (మత్తయి 21:23; మార్కు 11:28; లూకా 20:2). ఆయన అధికారముపై వారు దాడిచేయగా ఆయన తన్ను తాను సమర్ధించుకొంటారని నిశ్చయముగా వారనుకొన్నారు. అయితే యేసు యిచ్చిన జవాబునుబట్టి వారాశ్చర్య పడడమేకాకుండా, ఆ మతనాయకులు తమ్మునుతామే సమర్ధించుకోవలసిన పరిస్థితి యేర్పడినది (మత్త 21:24-27).

వారు యేసును "నీవు ఏ అధికారము వలన ఈ కార్యము

చేయుచున్నావో, యీ అధికారము యెవడు నీకిచ్చెనో చెప్పుమనిరి. అందుకాయన నేనును మిమ్మును ఒక మాట అడుగుదును. అది నాతో చెప్పుడి. యోహాను ఇచ్చిన బాప్తిస్మము పరలోకమునుండి కలిగినదా మనుష్యుల నుండి కలిగినదా? అని వారినడుగగా వారు మనము పరలోకము నుండి కలిగినదని చెప్పిన యెడల- అలాగైతే మీరెందుకు అతని నమ్మలేదని ఆయన మనలను అడుగును. మనుష్యుల వలన కలిగినదని చెప్పిన యెడల ప్రజలందరు మనలను రాళ్లతో కొట్టు దురు. ఏలయనగా యోహాను ప్రవక్తయని అందరు రూఢిగా నమ్ముచున్నారని తమలో తాము ఆలోచించుకొని అది ఎక్కడ నుండి కలిగినదో మాకు తెలియదని ఆయనకు ఉత్తరమిచ్చిరి. అందుకు యేసు ఏ అధికారము వలన ఈ కార్యములు చేయుచున్నానో నేనును మీతో చెప్పనని వారితోననెను" (లూకా 20:2-9).

ఘర్షణ పూర్వకమైన ఈ సంభాషణ సందర్భముగా యేసు రెండు ఉపమానములు చెప్పెను. వాటిని ఆయన అమత నాయకులకు వర్తింప జేసెను. ఇద్దరు కుమారులను గూర్చిన ఉపమానము చెబుతు, యేసు "సుంకరులును, వేశ్యలును మీకంటె ముందుగా దేవుని రాజ్యములో ప్రవేశించువారని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను" (మత్తయి 21:31). దాని వెనువెంటనే ఆయన దుర్మార్గులైన తోట కాపులను గూర్చిన ఉపమానము చెప్పెను.

ఉపమానము :

"ఇంటి యజమానుడొకడుండెను. అతడు ద్రాక్షతోట నాటించి దానిచుట్టు కంచెవేయించి అందులో ద్రాక్షల తొట్టి తొలిపించి గోపురము కట్టించి కాపులకు దాని గుత్తకిచ్చి దేశాంతరము పోయెను. పండ్లకాలము సమీపించినప్పుడు పండ్లలో తన భాగము తీసికొని వచ్చుటకు ఆకాపుల యొద్దకు తన దాసులనంపగా ఆకాపులు అతని దాసులను పట్టుకొని, యొకని కొట్టిరి. యొకని చంపిరి, మరి యొకని మీద రాళ్లు రువ్విరి. మరల ఈతడు మునుపటికంటె ఎక్కువమంది ఇతర దాసులనంపగా వారు వీరిని ఆ ప్రకారమే చేసిరి. తుదకు నాకుమారుని సన్మానించెదరనుకొని తన కుమారుని వారి యొద్దకు పంపెను. అయినను ఆకాపులు కుమారుని చూచి ఇతడు వారసుడు ఇతని చంపి ఇతని స్వాస్థ్యము తీసికొందము రండని తమలో తాము చెప్పుకొని అతని పట్టుకొని ద్రాక్షతోట వెలుపల పడవేసి చంపిరి. కాబట్టి ఆ ద్రాక్షతోట యజమానుడు వచ్చినప్పుడు ఆకాపుల నేమి చేయవలెననెను. అందుకు వారు ఆ దుర్మార్గులను కఠినముగా సంహరించి, వాటి వాటి కాలముల యందు తనకు పండ్లను

చెల్లించునట్టి ఇతర కాపులకు ఆ ద్రాక్షతోట గుత్తకిచ్చునని ఆయనతో చెప్పిరి. మరియు యేసు వారిని చూచి ఇల్లుకట్టువారు నిషేధించిన రాయి మూలకు తలరాయి అయెను. ఇది ప్రభువు వలన కలిగెను. ఇది మన కన్నులకు ఆశ్చర్యము అను మాట మీరు లేఖనము లలో ఎన్నడు చదువలేదా ?కాబట్టి దేవుని రాజ్యము మీ యొద్దనుండి తొలగింపబడి, దాని ఫలమిచ్చు జనుల కియ్యబడునని మీతో చెప్పుచున్నాను. మరియు ఈ రాతి మీదపడువాడు తునకలైపోవును గాని అది ఎవనిమీదపడునో వానిని నలి చేయున నెను. ప్రధాన యాజకులును పరిసయ్యు లును అయన్న చెప్పిన ఉపమానములను విని, తమ్మును గూర్చియే చెప్పెనని గ్రహించి ఆయనను పట్టుకొన సమయము చూచుచుండిరి గాని జనులందరు ఆయనను ప్రవక్తయని యెంచిరి గనుక వారికి భయపడిరి" (మత్తయి 21:33–46).

యేసు చెప్పిన ఉపమానములో పాలస్తీన ప్రజలందరు ఎరిగిన వ్యవసాయ పనిని గూర్చి చెప్పారు. ఆ ప్రాంతములో మరియే పంటలు లేకపోయినా, ద్రాక్ష తోటలు మాత్రము విస్తారముగా యుండేవి. యేసు చెప్పిన ద్రాక్షతోట మిగతా వాటి కంటే ఫలభరితమైనది. దానిని గృహయజమానియే స్వయంగా నాటించాడు. దానిచుట్టూ కంచె వేయిం చాడు (యెషయా 5:1–7). దానిలో ద్రాక్షలతొట్టి తొలిపించి గోపురముకూడ కట్టించాడు (మత్తయి 21:33). పెద్ద తొట్లెలు తొలిపించి అందులో ద్రాక్ష పండ్లు వేసి వాటిని తొక్కించే వారు (న్యాయా 9:27; యెషయా 63:3). ఆ తొట్టి ప్రక్కను వున్న చిన్న రంధ్రము ద్వారా ద్రాక్ష పండ్ల రసము మరియొక తొట్టిలోనికి సేకరించబడేది.

ద్రాక్షతోటలో యున్న గోపురము పై నుండి కావలివాడు తోటయంతటిని పర్యవేక్షించేవాడు. ద్రాక్షతోటలోనికి దొంగలు, పశువులు ప్రవేశించకుండా చూచుటకు ఈ గోపురము ఉపయోగ పడేది. ఈ ద్రాక్షతోటకు అన్ని సదుపాయములు సమకూర్చబడ్డాయి. మంచి వ్యాపారము దాని వలన జరుగుచుండెను.

ద్రాక్షతోట యజమానుడు కాపులకు దానిని గుత్తకిచ్చి దేశాంతరము పోయెను (మత్తయి 21:33). పంటలో కొంత భాగము కౌలుగా వారు యజమానికి చెల్లింప బాధ్యులు. పండ్ల కాలము సమీపించినప్పుడు తన భాగమును తీసికొని వచ్చుటకు ఆ కాపుల యొద్దకు యింటి యజమానుడు తన దాసులను పంపెను (21:34). అయితే ఆ కాపులు అతని దాసులను పట్టుకొని యొకని కొట్టిరి. యొకని చంపిరి. చివరిగా ఆ యజమానుడు తన కుమారునే పంపెను. వారతని

హత్యచేసి ఆ ద్రాక్షతోటను స్వాధీన పరచుకొన ప్రయత్నించిరి (మత్త 21:37-39).

ఒక్క క్షణము యేసు ఆగి, "ఆద్రాక్షతోట యజమానుడు వచ్చి నప్పుడు ఆ కాపులనేమిచేయునని" వారినడిగెను (మత్త 21:40). ఆ మత నాయకులు ఆ ఉపమానము తమకే వర్తించునని గ్రహించకుండగనే ఆ ప్రశ్నకు సరియైన జవాబిచ్చిరి.

దేవుడు యూదులను ఇదివరకే ఒక ద్రాక్షతోటగా పోల్చి చెప్పినట్లు గమనించాము (యెషయా 5:1-7). ఉపమానమును వినుచున్నవారు దాని భారము వారికే వర్తించుచున్నదని గ్రహించకమునుపే చెప్పబడెను (2 సమూ 12:1-9). యేసు దుర్మార్గులైన కాపులను గూర్చినది, దానికి ముందు చెప్పబడినది కూడ సరిగ్గా యిదే విధముగా వినియోగించెను.

ఈ ఉపమానములో యింటి యజమాని దేవుడు. ద్రాక్షతోట సంఘము. ప్రవచనాత్మకముగా అది ఇశ్రాయేలీయులకు ముందు వర్తించెను. తదుపరి అది వారినుండి తీసివేయబడి ఆత్మీయ ఇశ్రాయేలుకు అప్పగించబడెను. రోమా 11:15-24లో పౌలు యొక్క బోధను గమనించుము. క్రీస్తు రాక కొరకు, సంఘావిష్కరణ కొరకు దేవుడు యూదులను బాగుగా సిద్ధపరచెను. గాని వారు దేవుని కుమారుడైన క్రీస్తును సిలువ వేసి చంపారు. ఆయన సంఘాన్ని హింసించారు.

ఆ ఉపమానములో కాపులు పురాతన భౌతిక ఇశ్రాయేలీయులు. యజమానుడు దేశాంతరముకుపోవుట పాత కొత్త నిబంధనల మధ్యనున్న నిశ్శబ్ద కాలము. పంపబడిన దాసులు దేవుని ప్రవక్తలు, వారు హింసించబడిరి, చంపబడిరి (మత్తయి 23:34-35; 1 రాజులు 18:13; 19:10; 2 రాజులు 16:31; 22:24; 2 దినవృ 36:16; యిర్మియా 20:1- 2 అపో.కా. 12:1-2; హెబ్రీ 11:36-38). క్రొత్త కాపులు అన్యజనులు (రోమా 11: 15-24).

కుమారుడు, వారసుడు యేసు క్రీస్తు. ఆయన దేవుని ప్రియ కుమారుడని మార్కు వ్రాసాడు (మార్కు 12:6). ద్రాక్షతోటకు వారసుడు తోట వెలుపల ఎట్లు చంపబడ్డాడో అట్లే యేసు క్రీస్తుకూడ యెరూషలేము వెలుపల చంపబడ్డారు ఈ ఉపమానములో యేసు తన మరణమును గూర్చి ప్రవచించారు (మత్తయి 16:21). వారసునికి ముందు దాసులు ఎట్లు పంపబడ్డారో, అట్లే యేసుకు ముందుగా ప్రవక్తలు పంపబడ్డారు. దాసులకంటే వారసుడు ఎంతశ్రేష్టుడో, అట్లే ప్రవక్తల కంటే యేసు ఎంతో శ్రేష్టుడు, వారసుడు. చివరిగా

పంపబడినట్లు యేసు చివరిగా పంపబడ్డారు.

మానవజాతికి విమోచన కర్త యేసుక్రీస్తు ఒక్కడు మాత్రమే. ఆ విమోచన కర్తను నిరాకరించిన యూదులకు వారు విన్నవించుకొనే వేరొక విమోచన కర్తయెవడును లేడు (హెబ్రీ 10:26). యూదులు మతనాయకులు యేసుయొక్క దైవత్వాన్ని గూర్చి పూర్తిగా ఎరుగనివారు కారు గాని వారాయనను చంపించారు (యోహాను 3:1-2). వారసుడైన కుమారుని వారు చంపించారు. కాబట్టి యూదులు క్రీస్తును చంపించుటలో అజ్ఞానులు కారు. (లూకా 23:34; అపొ.కా. 3:17).

దుర్మార్గులైన కాపులను గూర్చి వ్రాయబడిన మూడుచోట్ల ప్రధాన యాజకులు, శాస్త్రులు, పెద్దలు కూడ ఆ ఉపమానము తమ్మును గూర్చియే చెప్పబడెనని అంగీకరించారు (మత్త 21:46, మార్కు 12:12; లూకా 20:19). అందువలన వారు యేసును పట్టుకొని హింసింపగోరారు. గాని ప్రజలందరు యేసు దేవుని నుండి వచ్చిన ప్రవక్తయని ఎంచుచున్నందున వారు తమ్మును తాము నిరోధించుకొనిరి. యేసే క్రీస్తని, మెస్సీయయని ప్రజలు అంగీకరించు నట్లు ఈమత నాయకులు సహాయపడి యుండవలసినది. ఈ నాయకులు ప్రజల నుండియైనా నేర్చుకొని యుండవలసినది. ఈ నాయకుల దుర్మార్గత ద్వారా దేవుడు తన కృపను బట్టి క్రీస్తు ద్వారా విమోచనను గ్రహించునని వారు గ్రహింపనే గ్రహింపలేదు (యోహాను 11:47-53; అపొ.కా. 2:23-36).

యేసుప్రభువు ఈ సంభాషణను పాతనిబంధన లేఖనములను తనకు అన్వయింప జేసికొనుచు ముగించెను. ప్రవచనములో రాయి ఎట్లు తిరస్కరించబడెనో, యేసును కూడ యూదామత నాయకులు తిరస్కరించారు. తిరస్కరింపబడిన రాయి మూలకు తల రాయిగా ఎట్లు విజయం సాధించెనో, అట్లే యూదులపై యేసుకూడ విజేయుడగును. దిగువ వచనముల తారతమ్యమును చూడుము.

"ఇల్లు కట్టువారు నిషేధించిన రాయి మూలకు తలరాయి అయెను" (కీర్తన 118:22).

"మరియు యేసు వారిని చూచి ఇల్లు కట్టువారు నిషేధించిన రాయి మూలకు తల రాయి అయెను. ఇది ప్రభువు వలననే కలిగెను. ఇది మన కన్నులకు ఆశ్చర్యము అనుమాట మీరు లేఖనములలో ఎన్నడు చదువలేదా? కాబట్టి దేవుని రాజ్యము మీ యొద్దనుండి తొలగింపబడి దాని ఫలమిచ్చు జనుల కియ్యబడునని మీతో చెప్పుచున్నాను. మరియు ఈ రాతిమీద పడువాడు

తునకలైపోవును గాని అది ఎవనిమీద పడునో వానిని నలి చేయుననెను" (మత్తయి 21:42-44).

"ప్రభువగు యెహోవా ఈలాగున సెలవిచ్చుచున్నాడు -సీయోనులో పునాదిగా రాతిని వేసినవాడను నేనే. అది పరిశోధింపబడిన రాయి మూలకు తలరాయియై యున్నది. విశ్వసించువాడు కలవరపడడు" (యెషయా 28:16).

"మరియు చేతిసహాయములేక తీయబడిన ఒక రాయి యినుమును మట్టియు కలిసిన అప్రతిమ యొక్క పాదముల మీదపడి దానిపాదములను తుత్తునియలుగా విరుగగొట్టినట్లు తమకు కనబడెను" (దానియేలు 2:34-35).

"మనుష్యుల చేత విసర్జింప బడినను, దేవుని దృష్టికి ఏర్పరచ బడినదియు అమూల్యమును సజీవమైన రాయియగు ప్రభువునొద్దకు వచ్చిన వారై యేసుక్రీస్తు ద్వారా దేవునికి అనుకూలము లగు ఆత్మసంబంధమైన బలులు అర్పించు టకు పరిశుద్ధయాజకులుగా నుండునట్లు మీరును సజీవమైన రాళ్లవలె నుండి ఆత్మ సంబంధమైన మందిరముగా కట్టు బడుచున్నారు. ఏలయనగా ఇదిగో నేను ముఖ్యమును ఏర్పరచబడినదియు అమూల్యమునగు మూల రాతిని సీయోనులో స్థాపించుచున్నాను; ఆయన యందు విశ్వాసముంచు వాడు ఏమాత్రమును సిగ్గుపడడు అను మాట లేఖనములయందు వ్రాయబడి యున్నది. విశ్వసించుచున్న మీకు, ఆయన అమూల్యమైన వాడు; విశ్వసింపని వానికైతే -ఇల్లు కట్టువారు ఏ రాతిని నిషేధించిరో అదే మూలకు తలరాయి ఆయెను. మరియు అడ్డురాయియు, అడ్డు బండయు ఆయెను". కట్టువారు వాక్యమునక విధేయులై తొట్రిల్లుచున్నారు. దానికే వారు నియమింపబడిరి" (1పేతురు 2:48). 1కొరింథి 1:23; 10:4 కూడ చూడుము.

పైన చెప్పబడిన రాయి, బండ యేసుక్రీస్తే. మూలరాయి రెండు గోడలను కలుపును, బలపరచును. ప్రపచనము ద్వారా యేసు క్రీస్తు పాత కొత్త నిబంధనలను జతపరచు చున్నారు, యూదులను అన్యులను ఏకము చేయుచున్నారు.

**ముగింపు :**

ప్రజలకు బోధించు అధికారము యేసుకలిగి యుండెనా? నిశ్చయముగా కలిగియుండెను. అది యదార్థమని మంచి మనస్సు గల వారంగీకరిస్తారు. ఆయనకు ఇప్పటికీ ఆయధికారమున్నది. నీవు నేను కూడ అంత్యదినమందు ఆయన చెప్పిన మాట చొప్పున తీర్పుతీర్చ బడుదుము.

-లూయిస్ రష్‌మోర్

## సంఘమును గూర్చి నీవు నిజముగా తెలిసికొనగలవు

## (You can be sure about the Church)

"నీవే నిత్య జీవపు మాటలు గలవాడవు, నీవే దేవుని పరిశుద్ధుడవని మేము విశ్వసించి యెరిగియున్నామని" పేతురు యేసుతో పలికెను (యోహాను 6:69).

"యేసు ఫిలిప్పుదైన కైసరయ ప్రాంతములకు వచ్చి - మనుష్య కుమారుడెవడని జనులు చెప్పుకొను చున్నారని తన శిష్యులను అడుగగా - వారు కొందరు బాప్తిస్మమిచ్చు యోహాననియు, కొందరు ఏలీయా యనియు, కొందరు యిర్మీయా అనియు లేక ప్రవక్తలలో ఒకడనియు చెప్పుకొను చున్నారనిరి. అందుకాయన- మీరైతే నేను ఎవడనని చెప్పుకొనుచున్నారని వారి నడిగెను. అందుకు సీమోను పేతురు -నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువని చెప్పెను. అందుకు యేసు – సీమోను బర్‌యోనా, నీవు ధన్యుడవు, పరలోకమందున్న నా తండ్రి ఈ సంగతుల నీకు బయలు పరచెనేకాని నరులు నీకు బయలు పరచలేదు. మరియు నీవు పేతురువు; ఈ బండ మీద నా సంఘమును కట్టుదును, పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువ నేరవని నేను నీతో చెప్పుచున్నాను" (మత్తయి 16:13–18).

పై లేఖనములలో యేసు "నాసంఘమును కట్టుదును" అని చెప్పెను నేడు ప్రపంచములో అనేక సంఘములు న్నాయి. అవన్నీ దేవునితో సంబంధము కలిగియున్నట్లు చెప్పుకొంటాయి. అయితే వీటిలో యేది సత్యమో ఒకడు నిజముగా ఎట్లు తెలిసికొనుగలడు ? వీటిలో యేది రైటో ఒకడు తెలిసికొనవచ్చునా? తప్ప కుండా తెలిసికోవచ్చును! యేసు క్రీస్తుకు ఒక సంఘమున్నది. దేవుని గ్రంధపుటలలో దానిని మనము గుర్తించవచ్చును. క్రీస్తుకు చెందిన సంఘమును గుర్తించుటకు దాని యొక్క రూపురేఖల్లున్నవి. ఒకడు తన కారును పోగొట్టుకొంటే దానిని గుర్తించ గల కొన్ని రూపురేఖలుంటాయి. అది ఏసంవత్సరములో తయారయ్యిందో, దాని రంగు, దాని తయారు దాని రిజిష్టరు సంఖ్య మొ॥నవి అతడెరుగును. మిగతా కారులకు తన కారుకు కొన్ని సమాన లక్షణము లున్నను, తన సొంతకారును ఒకడు గుర్తించగలడు గదా, తన కారులాంటి రంగునే వేరొక కారు కలిగి యుండును గాని, దానిమోడల్ వేరైయుండును, అది తనది కాదని అతడెరుగును. క్రీస్తు సంఘములాంటి కొన్ని సంఘములుండ వచ్చును గాని అవి క్రీస్తువి కావు ! సంఘము యొక్క నిజరూపు లేఖలు ఏమిటి?

**దాని నిర్మాణకుడు :**

యేసుక్రీస్తే తన సంఘమునకు నిర్మాణకుడు. "నాసంఘమును నేనుకట్టుదునని" ఆయనే చెప్పెను (మత్తయి 16:18). క్రీస్తును తన నిర్మాణకునిగా లేని ఏసంఘమయినను ఆయన సంఘము కానేరదు. యేసుక్రీస్తు చే గాక మానవులచే డినామినేషన్లు నిర్మించబడ్డాయి. జాన్‌కేల్విన్, జాన్ వెస్లీ మొ॥గు వారు వేర్వేరు డినామినేషన్లను నిర్మించారు. ఈ మానవనిర్మిత సంఘములు క్రీస్తుచే నిర్మించబడ లేదు గనుక అవి ఆయనకు చెందవు. క్రీస్తు సంఘము ఒక డినామినేషన్, కాదు. అదియే క్రొత్త నిబంధన సంఘము.

**దాని శిరస్సు :**

క్రీస్తును తప్పవేరొకని తన శిరస్సుగా కలిగిన ఏసంఘమయినను క్రీస్తు సంఘము కానేరదు. యేసుక్రీస్తు ఒక్కడే సంఘమునకుశిరస్సు అని బైబిలు బోధించుచున్నది. "మరియు సమస్తమును ఆయన పాదముల క్రిందఉంచి, సమస్తము పైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను. ఆసంఘము ఆయన శరీరమై యున్నది; సమస్తమును పూర్తిగా నింపుచున్న వాని సంపూర్ణతయై యున్నది" (ఎఫెసీ 1:22–23). పోపుగాని, బిషప్‌గాని, మరియే మనుష్యుడుగాని సంఘమునకు శిరస్సు కాదు. క్రీస్తే శిరస్సు. ఆయనకు ఇహపరములయందు సర్వాధికారమున్నది (మత్తయి 28:18).

**స్థాపించబడిన సమయము, స్థలము :**

క్రీస్తు సంఘము యెరూషలేములో స్థాపించబడెను. ప్రభువుసంఘము యెరూషలేములో స్థాపించబడుననియు, అక్కడ నుండే దేవుని ధర్మశాస్త్రము విడుదల అవుననియు యెషయా ప్రవచించాడు. "అంత్యదినములలో పర్వతములపైన యెహోవా మందిర పర్వతము పర్వత శిఖరమున స్థిరపరచబడి కొండల కంటే ఎత్తుగా ఎత్తబడును. ప్రవాహము వచ్చినట్లు సమస్త అన్యజనులు దానిలోనికి వచ్చెదరు. ఆకాలమున సీయోనులో నుండి ధర్మశాస్త్రము యెరూషలేము నుండి యెహోవా వాక్కు బయలు వెళ్లును. జనులు గుంపులు గుంపులుగా వచ్చి యాకోబు దేవుని మందిరమునకు యెహోవా పర్వతమునకు మనము వెళ్లుదము రండి, ఆయన తన మార్గముల విషయమై మనకు బోధించును మనము ఆయన త్రోవలలో నడుతము అని చెప్పుకొందురు" (యెష 2:2–3).

ప్రభువు సంఘముస్థాపించబడే పట్టణమును గూర్చి చెప్పుటయే గాక, అది ఎప్పుడు స్థాపించబడునో, దాని సమయాన్ని గూర్చి కూడ యెషయా ప్రవచించాడు. అది 'అంత్యదినములలో' జరుగునని అతడు చెప్పాడు. ఈ

అంత్యదినములు పెంతెకొస్తు దినమున ఆరంభమైనట్లు పేతురు గుర్తించాడు. "యోవేలు ప్రవక్త ద్వారా చెప్పబడినసంగతి యిదే, ఏదనగా అంత్యదినముల యందు నేను మనుష్యులందరి మీద నా ఆత్మను కుమ్మరించెదను, మీకుమారులును మీకుమార్తెలును ప్రవచించెదరు, మీ యౌవనులకు దర్శనములు కలుగును. మీవృద్ధులు కలలు కందురు" (అపో.కా. 2:16-17).

క్రైస్తవ యుగమే అంత్యదినముల కాలము. అది మన కాలములో అంతిమ యుగము గనుక అంత్యదినము లని పిలువబడినది. క్రైస్తవ యుగాంత మందు క్రీస్తు మరల వచ్చును. అప్పుడు తీర్పుజరుగును. దుష్టులు నిత్య నరకము నకును, రక్షింపబడినవారు నిత్యజీవము నకును పోవుదురు (మత్తయి 25:46).

అపో.కా. రెండవ అధ్యాయములో యెషయా ప్రవచనము యొక్క నెరవేర్పును లూకా రికార్డు చేసాడు. అపొస్తలులు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందేవరకు యెరూషలేములో కనిపెట్టవలెనని చెప్ప బడినది (లూకా 24:46,49). తదనం తరము పెంతెకొస్తు దినమునవారు పరిశు ద్ధాత్మ శక్తిని పొంది, యేసుక్రీస్తు సువార్తను బోధించిరి. ప్రభువు సంఘము ఆదిన మందు స్థాపించబడెను. మరియు యెషయా ప్రవచించినట్లే ప్రభువు యొక్క వాక్యము యెరూషలేము నుండియే బయలు వెళ్లెను. గనుక క్రీస్తు సంఘము క్రీ॥శ॥ 33వ సంవత్సరములో యెరూషలేములో పెంతెకొస్తు పండుగ దినమున స్థాపించబడెను. గనుక ఏసంఘమైనను యెరూషలేములో గాక వేరొక చోటను. మొదటి శతాబ్ధములో గాక వేరొక సమయంలో స్థాపించబడి యుంటే, అది క్రీస్తుసంఘము కానేరదు!

**దానినామము :**

బైబిలు చదువుచుండగా సంఘము వివిధనామకరణములతో వర్ణించబడినట్లు కనుగొనగలము. యేసు దానిని "నా సంఘము" అన్నారు (మత్తయి 16:18). అది 1 కొరింథీ 1:2లో దేవుని సంఘము అనిపిలువ బడినది. రోమా ప్రాంతములో యున్న సంఘములనుద్దేశించి "క్రీస్తు సంఘములు" అని పౌలు వ్రాసాడు (రోమా 10:16). యివి వేర్వేరు డినామినేషన్లు గాక, భౌగోళికంగా ఆయాప్రాంతములలో యున్న క్రీస్తు సంఘములని గుర్తుంచుకోవాలి. బైబిలులో డినామినేషన్ల పేర్లు యేమీకనబడవు. బాప్టిస్టు సంఘములు, పెంతెకొస్తు సంఘములు, మెదడిస్టు సంఘములు, కేథలిక్ సంఘములు, లూథరన్ సంఘములు మొదలగునవి బైబిలులో కనబడవు. ఎవడైనను ఉపదేశించిన యెడల దైవోక్తులను ఉపదేశించినట్లు ఉపదేశించవలెనని"

దేవుడు చెప్పుచున్నారు (1పేతురు 4:11). మనము లేఖనములు మాట్లాడనట్లు మాట్లాడవలెను. సంఘము ను దేవుడు పిలిచిన రీతిగా గాక వేరొక రీతిగా పిలిస్తే అది లేఖనార్థము కాదు. ఒకమానవుని పేరునుగాని, ఆ పేరును బట్టియున్న బోధను బట్టి గాని పిలువబడే ఏసంఘమయినను క్రీస్తుసంఘముకాదు. క్రీస్తు సంఘము అనునది దైవిక నామము. అది లేఖనార్థమైన నామము. "క్రీస్తు సంఘములన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి" యని అందుకే పౌలు వ్రాసాడు (రోమా 16:16).

ఆరాధనలో

"దేవుడు ఆత్మగనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధించవలెను" (యోహాను 4:24). ఆయనను ఆరాధించువారందరు ఆత్మతోను, సత్యముతోను ఆరాధించ వలెనని దేవుడు చెప్పుచున్నారు. దేవుని సత్యముతో ఆరాధించుటయనగా ఆయన సత్యవాక్యము ప్రకారము ఆరాధించుట యని అర్థము, "సత్యమునందు వారిని ప్రతిష్టచేయుము. నీ వాక్యమే సత్యమని" యేసుపలికారు (యోహాను 17:17). ఆరాధన ఎట్లు చేయాలో దాని ప్రామాణి కము దేవుని వాక్యమే.

ఆరాధనలో ఐదు అంశము లున్నట్లు క్రొత్త నిబంధన చెప్పుచున్నది. వారములో మొదటి దినమున ఆరాధన జరుగవలెను. ఆరాధనలో మనము దేవుని వాక్యమునుపదేశించాలి (అపొ.కా. 20:7), కానుకలనీయాలి (1 కొరింథీ 16:1–2). ప్రార్థన చేయాలి (1థెస్స 5 : 17). పాటలుపాడాలి, వాద్యములు లేకుండాపాడాలి (ఎఫెసీ 5:19, కొలస్స 3:16), మరియు ప్రభురాత్రి భోజనము చేయాలి (అపొ.కా. 20:7; మత్తయి 26: 26–28). యివన్నియు ఆదివారమున జరిగించాలి. దానినే ప్రభువుదినమని కూడ చెబుతారు (ప్రక 1:10). ఈ అయిదు క్రియలకు మించిగాని, లోపించిగాని ఆరాధన చేయు ఏ సంఘమయినను క్రీస్తు సంఘము కాదు. అది దైవికనమూనాన నుసరించి ఆరాధన చేయుటలేదు.

దాని ఆర్గనైజేషన్ :

సంఘము ఎట్లుండవలెనని కోరాడో దేవుడు అట్లే ఖచ్చితముగా ఆయన దానిని స్థాపించారు. గాని మానవుడు దేవుని ఆర్గనైజేషన్ నుండి తొలగిపోయి దైవిక నమూనాకు వేరైన సంఘములను స్థాపించాడు ఇంతకు ముందు చెప్పినట్లు యేసుక్రీస్తు ఒక్కరే ఆయన సంఘమునకు శిరస్సు (ఎఫెసీ 1:20–21). ప్రతిస్థానిక సంఘము పెద్దలని పిలువబడే పురుషుల పర్యవేక్షణ క్రింద యుండును (అపొ.కా. 14:30).

పెద్దలనే అధ్యక్షులని, కాపరులని కూడ లేఖనములు పిలుచుచున్నవి (అపొ.కా. 20:28; ఎఫెసీ 4:11). ప్రతిస్థానిక సంఘము స్వయం ప్రతిపత్తి కలిగి స్థానిక పెద్దలచే పాలింపబడును. ఒక మనుష్యుడు గాని, మనుష్యుల గుంపుగాని అనేక సంఘములను పాలించుట ఎన్నడు జరుగదు. అదే రీతిగా ప్రతిస్థానిక సంఘములోను పరిచారకులుందురు (ఫిలిప్పీ 1:1). ఈ పెద్దల యొక్కయు, పరిచారకుల యొక్కయు అర్హతలను 1 తిమోతి 3, తీతు 1వ అధ్యాయములలో కనుగొనవచ్చును. ఒక స్థానిక సంఘములో యున్న సభ్యులందరు, బోధకులు, పరిచారకులతో సహా అందరు పెద్దల యొక్క పర్యవేక్షణలో యుందురు. పెద్దలు దేవునికి బదులు తావే యేమియూ శాసనములు చేయరాదు. ఉన్నవాటిలో మార్పుచేయ రాదు. అన్ని సంగతులు స్థానిక సంఘపనిని పర్యవేక్షింతురు. వారు కాపుదల కప్పగింప బడిన ఆత్మలను, దేవుని మందను పై విచారణచేయుచు కాయుదురు (1 పేతురు 5:1-4).

## దానిలోకి ప్రవేశ షరతులు

ఒకడు క్రీస్తుసంఘసభ్యుడెట్లుగును? మొదటిగా అతడు క్రీస్తును గూర్చిన సువార్త వినవలెను (రోమా 10:17), తదుపరి యేసుక్రీస్తు దేవుని కుమారుడని విశ్వసించవలెను. "కాగా మీపాపముల లోనే యుండి చనిపోవుదురని మీతో చెప్పితిని. నేను ఆయనని మీరు విశ్వసించని యెడల మీరు మీ పాపములలోనే యుండి చనిపోవుదురని" యేసు చెప్పెను (యోహాను 8:24). పాపముల విషయమై మారుమనస్సు పొందవలెను. మనస్సు మార్చుకొన వలెను. "మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరు అలాగే నశింతురని" యేసుచెప్పెను (లూకా 13:3). తదుపరి యేసే దేవుని కుమారుడని మనుష్యుల యెదుట ఒప్పుకొనవలెను (అపొ.కా. 8:37; రోమా 10:10). అటుతరువాత పాపక్షమాపణ నిమిత్తము నీటిలో ముంచడము (బాప్తిస్మము) పొందవలెనని బైబిలు చెప్పుచున్నది. "అందుకు పేతురు – మీరు మారు మనస్సుపొంది పాపక్షమాపణ నిమిత్తము మీలో ప్రతివాడును యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అనువరమును పొందుదురు" అని చెప్పెను (అపొ.కా. 2:38). ఈ అయిదు విషయాలలోను ఒకడు ప్రభువు ఆజ్ఞలకులోబడినప్పుడు ప్రభువు అతనిని ఆయన సంఘము లోనికి చేర్చును. ఏలయనగా రక్షణ పొందిన ప్రతివారిని ప్రభువే తన సంఘముతో చేర్చుకొనును (అపొ.కా. 2:47).

**ముగింపు :**

క్రీస్తు సంఘము చాల ప్రాముఖ్యమైనది. యేసు తన సంఘమును తన స్వరక్తముతో కొనెను (అపొ.కా. 20:38). ఆయన మరల వచ్చినప్పుడా సంఘమును ఆయనతో కూడ పరలోకమునకు కొనిపోవును (ఎఫెసీ 5:23). బైబిలులో కనబడు క్రీస్తుసంఘములోగాక ఏదో ఒక మత శాఖలో నీవుంటే, బైబిలు నొద్దకు నీవెందుకు తిరిగి రాకూడదు? బైబిలులోని సంఘమును దాని శిరస్సు అదిస్థాపించబడిన సమయం, స్థలము, దాని ఆరాధన, ప్రవేశషరతులను బట్టి నీవుగుర్తించవచ్చును. అనేకులు దైవాను మతించబడని మానవకల్పిత సంఘము లను ఇప్పటికే విడనాడి యున్నారు. "పరలోకమందున్న నాతండ్రి నాటని ప్రతి మొక్కయు పెల్లగింపబడునని" యేసు చెప్పారు (మత్తయి 15:13).

నీవింకను ప్రభువు ఆజ్ఞలకు లోబడని యెడల, ఆయనకు లోబడవలెనని నిన్ను ప్రోత్సహించు చున్నాము. రక్షింపబడడానికి యేమి చేయాలో దేవుడు చెప్పిన మాటలే యివి. జ్ఞాపకముంచుకొనుము.

–బిల్లీ బ్లేండ్

## దేవుడు బీదలను సంరక్షించి హెచ్చించును
## (God Defends and Exalts the Poor)

పరమందొక దేవుడున్నారు ! మనకెట్లు తెలియును ? బాప్తిస్మమిచ్చు యోహాను యేసునొద్దకు తన శిష్యులను పంపించి ఆయన దేవుని కుమారుడో కాదో తెలిసికొనగోరాడు. క్రీస్తువారికిట్లు జవాబిచ్చారు: "మీరు వెళ్లి విన్నవాటిని, కన్నవాటిని యోహానుకు తెలుపుడి. గ్రుడ్డి వారు చూపుపొందుచున్నారు. కుంటి వారు నడుచుచున్నారు. కుష్ఠ రోగులు శుద్ధులగుచున్నారు, చెవిటి వారు వినుచున్నారు. చనిపోయిన వారు లేపబడుచున్నారు. బీదలకు సువార్త ప్రకటింపబడుచున్నది" (మత్తయి 11:4–5). మరియు "బీదలైన మీరు ధన్యులు, దేవుని రాజ్యము మీది" యని కూడ ఆయన తన శిష్యులకు చెప్పారు (లూకా 6:20).

**క్రీస్తు ఐశ్వర్యమును త్యజించారు :**

యేసు అట్లెందుకు చెప్పారు ? ఎందుకు చేసారు ? అది ఆయన జీవితము లోను తత్వములోను భాగమై యున్నది. "మీరు మనప్రభువైన యేసుక్రీస్తు కృపను ఎరుగుదురుగదా? ఆయన ధనవంతుడై యుండియు మీరు తన దారి ద్ర్యమువలన ధనవంతులు కావలెనని మీనిమిత్తము దరిద్రుడాయెను" (2 కొరింథీ 8:9). క్రీస్తు పరమందున్న దేవునితో యుండి, ఐశ్వర్యమును, మహిమను ఘనతను పొందుచుయుండెను. ఆయన దూతలందరి కంటె మిన్నయైన ఘనత పొందుచు నిత్యము

ఆలాగే యుండ వచ్చును గాని దాని నంతటిని ఆయన త్యజించి, మన బలహీనతలను, దుఃఖములను ఎరుగు నిమిత్తము బీదవాడాయెను. ఆయన ధనవంతుడైన ఒక భూస్వామి వలె ప్రవర్తింపలేదు. బీదలకు యేమిసంభవించినా తాను పట్టించుకోనన్నట్లు ప్రవర్తింపలేదు.

క్రీస్తుకు ఇట్టి మనస్తత్వము ఎందుకు వున్నది? ఆయన దేవుని కుమారుడు, మరియు ఆదినుండి దేవుడు మానవుని యెడల ఎట్లు చలించెనో అట్లే ఆయన చలించెను. బైబిలులో ఇట్లు వ్రాయబడియుండుట మనము చూడ గలము. "దరిద్రుని బాధించువాడు వాని సృష్టికర్తను నిందించువాడు. బీదలను కనికరించువాడు ఆయనను ఘనపరచు వాడు" (సామె 14:31). "బీదలను కనికరించువాడు యెహోవాకు అప్పిచ్చు వాడు" (సామె 19:17). "పేదలకును తండ్రి లేని వారికిని న్యాయము తీర్చుడి. శ్రమగల వారికిని దీనులకును న్యాయము తీర్చుడి" యని దేవుడు దావీదు ద్వారా పలికెను (కీర్తన 82:3). "ఏరాజు దరిద్రులకు సత్యముగా న్యాయము తీర్చునో ఆరాజుసింహాసనము నిత్యముగా స్థిరపరచబడును" (సామె 29:14). "బీదలకిచ్చువానికి లేమి కలుగదు. కన్నులు మూసికొను వానికి బహు శాపములు కలుగును" (సామె 28:27).

"నీతిమంతుడు బీదల కొరకు న్యాయము విచారించును. దుష్టుడు జ్ఞానము వివేచింపడు" (సామె 29:7). "నీనోరు తెరచి న్యాయముగా తీర్పు తీర్చుము. దీనులకు శ్రమపడు వారికిని దరిద్రులకును న్యాయము జరిగింపుము" (సామె 31:9). వివేకమంతురాలైన స్త్రీని గూర్చి చెబుతు ఆమె "దీనులకు తన చెయ్యి చాపును. దరిద్రులకు తన చేతులు చాపును" అని వ్రాయబడియున్నది (సామె 31:20). దేవుని ఈలేఖనములను చదివిన తరువాత దేవుని యందు నమ్మిక యుంచిన వారు దరిద్రులను బాధించు దుర్నని ఎవడు చెప్పగలడు? దేవుని యందు నమ్మిక యుంచిన కొందరు బీదలను హింసించియుండ వచ్చును. దేవుని యందు విశ్వాసముంచి నందు వలన గాక, ఆయన మాటలకు లోబడనందు వలననే వారట్లు చేసి యుందురు.

**బీదలతో పంచుకోవాలని నీతిమంతులు అజ్ఞాపింపబడిరి:**

"మీరు భూమి పంటను కోయునప్పుడు నీపొలము యొక్క ఓరలను పూర్తిగా కోయకూడదు, నీకోతలో పరిగెను ఏరుకొన కూడదు, నీఫల వృక్షముల తోటపరిగెను కూర్చుకొన కూడదు. నీఫలవృక్షముల తోటలో రాలిన పండ్లను ఏరుకొన

వలదు, బీదలకును పరదేశులకును వాటిని విడిచి పెట్టవలెను. నేను మీదేవుడైన యెహోవాను" (లేవీ 19:9-10).

మరల దేవుడు ఇట్లు చెప్పు చున్నారు: "పరవాసియైనను, అతిధియైనను నీసహోదరుడొకడు బీదవాడై నీయొద్దకు వచ్చిన యెడల నీవువానికి సహాయము చేయవలెను; అతడు నీవలన బ్రదుకవలెను. నీదేవునికి భయపడి వానియొద్ద వడ్డినైనను తీసికొన కూడదు; నీసహోదరుడు నీవలన బ్రదుకవలెను. నీరూకలు వానికి వడ్డికియ్యకూడదు, నీ ఆహారమును వానికి లాభమున కియ్యకూడదు, నేను మీకు కనాను దేశమునిచ్చి మీకు దేవుడగునట్లు ఐగుప్తు దేశములోనుండి మమ్మును రప్పించిన మీదేవుడైన యెహోవాను. నీ యొద్ద నివసించు నీ సహోదరుడు బీదవాడై నీకు అమ్మబడిన యెడల వానిచేతబానిస సేవ చేయించుకొన కూడదు ... నీ దేవునికి భయపడి అట్టివానిని కఠినముగా చూడకుము" (లేవీ 25:35-45).

**బీదవాడు బంధకములనుండి విముక్తుడు**

దేవుడిచ్చిన ఈ ఆజ్ఞలను బట్టి బీదవానికి ఏమైన అపదసంభవించిన యెడల, అతడు బానిసత్వమునుండి విడుదలపొంది తన కుటుంబమును పోషించుకొనును. అతడు అచ్చియున్న వానికి బానిసగా గాక, ఒక కూలి వానిగా పనిచేసి జీతముపుచ్చుకొన వచ్చును. నేనునీదేవుడైన యెహోవాను అని ఆయన ఆజ్ఞాపించెను. అనగా పరమందొక దేవుడున్నాడు గనుక ఆయనకు భయపడి ఆయన మాట విన వలెను.

**క్రైస్తవ్యము బానిసత్వమును నిర్మూలించును :**

ఈలోకములో క్రైస్తవ్యము ఎక్కడ ప్రబలియున్నదో అక్కడ బానిసత్వము నిర్మూలించబడినది. బీదవాడు తిరిగి లేచే తరుణము కల్పించబడినది. మానవులు దేవుని గుర్తించక, ఆయనకు భయపడక యున్నప్పుడు, ధనవంతులు, బలవంతులు బీదలను బానిసలుగా చేసివారిని హింసింతురు. నేడుకూడ దేవుని నెరుగక ఆయనను ఘనపరచక యున్న ప్రదేశాలలో ప్రజలు బానిసలుగా అమ్మబడుచు, కొనబడుచు యున్నారు. దేవుని యందు నమ్మిక యుంచిన ప్రదేశాలలో కూడ యిట్టి పరిస్థితులుండెను. వారు దేవుని మాటలను లక్ష్యపెట్టనందున కొంత కాలము అట్లుండెను.గనుక దేవుని యందు విశ్వాస ముంచుట వలన అన్యాయమైన భూస్వాములు ఉద్భవించి బీదలను వాడు కొందురని నమ్మవద్దు. దేవుని ప్రేమించి ఘనపరచువారు పడిపోయిన వారిని లేవనెత్తుదురు, న్యాయమైన జీతభత్యములనిమిత్తము, బీదలు తిరిగిలేచునట్లు అవకాశముకల్పింతురు.

-ఓటిస్ గట్జుడ్

## పాపి యొక్క ప్రార్థన
## (A sinner's Prayer)

క్రైస్తవులు కానివారి కోరికలను తీర్చుదునని దేవుడు వాగ్దానము చేయలేదు, కొన్ని ప్రార్థనలకు దేవుడు సానుకూలముగా జవాబీయడని లేఖనములు తెలియజేయుచున్నవి.

"నా హృదయములో నేను పాపమును లక్ష్యము చేసిన యెడల ప్రభువు నా మనవి వినకపోవును" (కీర్తన 66:18). "వాని మీద భక్తిహీనుని అధికారిగా నుంచుము, అపవాది వాని కుడిప్రక్కను నిలుచును గాక, వాడు విమర్శలోనికి తేబడునపుడు దోషియని తీర్పునొందును గాక, వాని ప్రార్థన పాపమగునుగాక" (కీర్తన 109:6-7). "ధర్మశాస్త్రము వినబడకుండ చెవిని తొలగించుకొను వాని ప్రార్థన హేయము" (సామెత 28:9). "ప్రభువు కన్నులు నీతిమంతుల మీదను, ఆయన చెవులు వారి ప్రార్థనల వైపునను ఉన్నవి గాని ప్రభువు ముఖము కీడు చేయు వారికి విరోధముగా ఉన్నది" (1 పేతురు 3:12; కీర్తన 34:15-16).

**మనమడుగునది పొందవలెనంటే :**

1. మొదటిగా ఆయన నామమును బట్టి పిలువబడు దేవుని ప్రజలుగా యుండాలి (2 దినవృ 7:14).

2. ఆయన నామమును బట్టి అడగాలి (యోహాను 14:13).

3. విశ్వాసముతో అడగాలి (యాకోబు 1:6-7).

4. సరియైన సంగతుల నడగాలి (యాకో 4:3).

5. దేవుని ఆజ్ఞలను పాలించాలి, ఆయన కిష్టమైన సంగతులు చేయాలి (1యోహా 3:22).

6. ఆయన చిత్తప్రకారము అడగాలి (1యోహా 5:14). క్రైస్తవులు కానివారు దేనినైన అడుగవచ్చుని ఎక్కడా చెప్ప బడలేదు.

**పెంతెకొస్తునాటి ప్రజలు :**

పెంతెకొస్తు దినమున పేతురు ప్రసంగమును వినినవారు తమ పాప క్షమాపణ నిమిత్తము ప్రార్థించాలని చెప్పబడలేదు. యోవేలు 2:32లో చేయబడిన ప్రవచనమును పేతురు ఆనాడు ఎత్తి చెప్పుచు ప్రభువు నామమును బట్టి ప్రార్థించువాడు రక్షింపబడునని చెప్పాడు. ఈమాటలు 'ఎపికలియో' అనుగ్రీకు పదమునుండి తర్జుమచేయబడెను. 'ఎపికలియో' అనగా ఒకనామమును బట్టి అడుగుట యాని అర్థము; విజ్ఞాపన చేయుటయని అర్థము (అపొ.కా. 1:23; 7:59, 25:11,12; 28:19). గనుక ప్రభువు నామమును బట్టి సింపుల్‌గా విజ్ఞాపన చేయువారు రక్షింపబడిపోరు గాని తండ్రి చిత్తము జరిగించువారే రక్షింప బడుదురు (మత్తయి 7:21;

లూకా 6:46).

"అయ్యలారా మేమేమి చేయాలి?" యని యూదులు పేతురును మిగిలిన అపొస్తలులను అడిగినప్పుడు, వారందరు ప్రార్థన చేస్తే చాలని పేతురు చెప్పలేదు (అపొ.కా. 2:37). సరిగదా, "మీరు మారుమనస్సుపొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి" యని చెప్పాడు (అపొ.కా. 2:38). సౌలు మారుమనస్సు పొంది తన పాపములను కడిగివేసుకొనుమని చెప్పబడెను (అపొ.కా. 9:11; 22:16). క్షమాపణ కొరకతడు చేసిన విజ్ఞాపననుబట్టి బాప్తిస్మము ద్వారా అది అతనికి అనుగ్రహించబడెను. కొర్నేలి యొక్క ప్రార్థనలు వినబడిన తరువాత అతడు బాప్తిస్మము పొందవలెనని ఆజ్ఞాపింపబడెను (అపొ.కా. 10:43). క్రైస్తవుడు కాని వాడెవడు తన పాపములు క్షమించబడుటకు ప్రార్థన చేయవలెనని చెప్పబడలేదు.

**పాపియొక్క ప్రార్థన:**

డినామినేషన్ల వారందరు తమ ప్రసంగము ముగింపులో ప్రజలు మారుమనస్సు పొంది నిష్కపటముగా ప్రార్థన చేస్తే వారు క్షమించబడ్తారని చెబుతారు. ఈ ప్రార్థన తతంగము ఒక గుంపునుండి వేరొక గుంపుకు తేడాగా యుంటాది. దేవుడుకోరునది యిదే అయితే ఆప్రార్థన ఒకే రీతిగ యుండును, దానిని గూర్చి లేఖనములలో చెప్పబడి యుండును.

"దేవా నా పాపములను గూర్చి నేను చింతించుచున్నాను, ఇప్పుడే నేను నాపాపముల నుండి తిరుగుచున్నాను. నన్ను క్షమించుము. యేసు క్రీస్తును పంపినందుకు వందనములు, నీవు నాజీవితములోనికి రమ్ము, నన్ను క్షమించినందుకు వందనములు". నీవు నా జీవితములోనికి" అనే ప్రార్థనచేస్తే దేవుడు నిన్ను క్షమిస్తాడు, నిన్ను తన కుటుంబములోనికి చేర్చుకొంటాడని డినామినేషన్లు చెబుతారు.

ఈ ప్రార్థన గాని, దానితో కూడిన వాగ్దానము గాని బైబిలులో ఎక్కడ లేదు. ఈ వాగ్దానము మనుష్యుడు చేసాడు దేవుడు కాదు. గనుక అట్టి ప్రార్థనలు వ్యర్థము. దానికి దేవుడు బాధ్యుడు కాదు.

**ముగింపు :**

దేవుని చిత్తప్రకారమున్న ప్రార్థనలనే ఆయన ఆలకించును గనుక దేవునితో మనము సరియైన సంబంధము కలిగి యుండాలి. పాపియైన వాడు రక్షింపబడే మార్గమును ఆయన తన గ్రంథమందు బయలుపరిచారు. దేవుని వాక్యమును విని (రోమా 10:17; అపొ.కా. 11:14), విశ్వసించి, బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును (మార్కు 16:16; అపొ.కా. 2:38; రోమా 10:10).

– ఓవేన్ ఆల్ బ్రిక్ట్

# సంక్షిప్త వార్తలు

యేసుప్రభువు ఎక్కడికి వెళ్లినా ప్రజలు ఆశ్చర్యచకితులయ్యారు. ఆయన బాలుడుగా యున్నప్పుడే యోసేపును ఆయన తల్లియు ఆయనను గూర్చి చెప్పబడిన మాటలను విని ఆశ్చర్యపడిరి (లూకా 2:23). ఆయన 12 ఏండ్లవాడైనప్పుడు దేవాలయములో బోధకుల మధ్య కూర్చుండి ప్రశ్నలు చేయుటయు. జవాబులు చెప్పుటయు చూచి, వినిన వారందరు ఆయన ప్రజ్ఞకు విస్మయ మొందిరి (లూకా 2:48).

ఆయన తన స్వగ్రామమందున్న సమాజమందిరములో యున్నవారందరు ఆయన నోటనుండి వచ్చిన దయ గల మాటలకు ఆశ్చర్యపడిరి (లూకా 4:22).

యేసు దేవాలయములో బోధించుచుండగా యూదులు అందుకు ఆశ్చర్యపడి, చదువుకొనని ఇతనికి ఈపాండిత్య మెట్లు వచ్చెనని చెప్పుకొనిరి (యోహాను 7:15).

యేసు రూపాంతరము పొందినప్పుడాయనతోయున్న శిష్యులు మిగుల భయపడి విభ్రాంతినొందిరి (మార్కు 9:2-8). ఆయన చేయుచున్నబోధను విన్న వారును, జనసమూహమంతయును మిగుల విభ్రాంతి నొంది ఆయనకు వందనము చేసిరి (మార్కు 9:14-15, మత్తయి 12:23; యోహాను 7:21). యేసు వలన "మూగ వారు మాటలాడుటయును, అంగహీనులు బాగుపడుటయును, కుంటివారు నడుచుటయును, గ్రుడ్డివారు చూచుటయును జనసమూహము చూచి ఆశ్చర్యపడి ఇశ్రాయేలుదేవుని మహిమ పరచిరి" (మత్తయి 15:31).

యేసుప్రభువు ఒక అంజూరపు చెట్టును శపించగా తక్షణమే ఆ అంజూరపు చెట్టు ఎండిపోయెను. శిష్యులది చూచి ఆశ్చర్యపడి అంజూరపు చెట్టు ఎంత త్వరగా ఎండిపోయెనని చెప్పుకొనిరి (మత్తయి 21:19-20). ఆయన ఒక సమరయస్త్రీతో సంభాషించుట చూచి శిష్యులు ఆశ్చర్యపడిరి (యోహాను 4:27). వారు ప్రకృతి ఆయన మాటకు లోబడుట చూచి విస్మయమొందిరి. వారు ఆశ్చర్యపడి ఈయన ఎట్టివాడో, ఈయనకు గాలియు సముద్రమును లోబడుచున్నవని చెప్పుకొనిరి (మత్తయి 8:27).

ఆయన బోధ విన్నవారు "అందరును విస్మయమొంది. ఇదేమిటో ? యిది క్రొత్తబోధగా యున్నదే"యని ఆశ్చర్యపడిరి (మార్కు 1:27). పునరుత్థానుడైన ఆయన శరీరమును చూచి శిష్యులు ఆశ్చర్యముతో భయాక్రాంతులైరి (లూకా 24:36-41). ఆయన శత్రువులు ఆయన మాటలు విని ఆశ్చర్యపడిరి (మత్త 22:22). రోమా గవర్నరయిన పిలాతు ఆయన ఒక్కమాటయైనను పలుకకుండుట చూచి మిక్కిలి ఆశ్చర్యపడెను (మత్తయి 27:14).

ఆయనను శిలువ వేసిన వారు సయితము జరిగినది చూచి, "ఈమనుష్యుడు నిజముగా నీతిమంతుడై యుండెనని చెప్పి" దేవునిమహిమపరచిరి (లూకా 23:47).

# మీకొకగొప్పసదవకాశం

సత్యవాణి ద్వారా ప్రచురింపబడిన అత్యంత విలువైన పుస్తకములు 15 రకములు ఇప్పుడు లభ్యమగుచున్నవి. వాటి నికర మూల్యము 500/- రూ॥లు అగును. గాని మీరు 85/- రూ॥లు మాత్రమే మాకు M.O. పంపి వాటిని ఉచితముగా పొందవచ్చును. బైబిల్‌విద్యార్థులకు, బోధకులకు, తర్ఫీతుశాలలకు యిది గొప్ప సదవకాశం. ఈ రోజే మాకు వ్రాయండి. M.O.పంపించి పుస్తకములను పొందండి. మీ యింటిలో మినీ లైబ్రరీని స్థాపించండి.


## Satya Vani


**#7-9-35, Sambamurth Street,**

**Kakinada - 533 004. Ph: 0884 - 2363722**



RNI Regd. No. 69973/98

Postal Regd. No. AP-VM/KD/02/2012-2014



Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004